విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి


లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ స్నాతకోత్సవంలో విద్యార్థులతో గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు చిన్నతనం నుంచి తమ భవిష్యత్‌కు పునాదుల వేసుకోవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదైనా సాధించాలనుకుంటే పట్టుదలతో ముందుకు నడవాలన్నారు. విద్యార్థులు ఎప్పుడూ ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని, వారి తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్ కోసం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. పాఠశాల నిర్వాహకురాలు కోమటిరెడ్డి మంజుల రాణి, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా వేయాలి

ఉప్పల్: రోడ్లపై చెత్త వేసే వారిపై జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ జీహెచ్ఎంసీ అధికారులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఉప్పల్ బస్తీల్లో పర్యటనలో భాగంగా బుధవారం ఉప్పల్ భరత్‌నగర్‌లోని కల్లు కాంపౌండ్ వద్ద పేరుకుపోయిన చెత్తను చూసి విస్తుపోయారు. వెంటనే శానిటేషన్ విభాగం అధికారులను పిలిపించి సమస్యను చూపించారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఖాళీ స్థలాలు ఉంటే అక్కడ చెత్త వేయకుండా ఉండే విధంగా ఫెన్సింగ్ వేయాలని, చెత్త వేసే పాయింట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షకాలంలో చెత్తతో మరింత ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున చర్యలను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకుల మహేందర్, పల్లి నాగరాజు, మేకల సర్వారెడ్డి, నిరంజన్, సుక్క కిరణ్, రంగా, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఉప్పల్ భరత్‌నగర్‌లో చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఇంతలో అంత మార్పా !

- పుంజుకున్న బీజేపీ ఓటు బ్యాంకు
- కాంగ్రెస్ పార్టీకి తగ్గిన మద్దతు
- బీఆర్ఎస్ పార్టీని పట్టించుకోని స్థానిక నాయకులు

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో బలంగా ఉన్నా బీఆర్ఎస్ ఓటు బ్యాంకు పార్లమెంట్ ఎన్నికలలో ఎటు పోయిందనే చర్చలు నియోజకవర్గంలో జోరుగా జరుగుతున్నాయి. ఏ ఎన్నికలు వచ్చినా పూర్తి ఆధిపత్యం చూపే బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికలలో ఎందుకు దెబ్బ తిందనే అంశాలు అంతుచిక్కకుండా నాయకులను సతమతం చేస్తున్నాయి. అనేక ఎన్నికలలో బీఆర్ఎస్ కు మద్దతిచ్చినా ఓటర్లు తమ ఓటు బ్యాంకు కాదని వారు తాత్కాలికంగా గాలి ఎటు ఉంటే అటువైపు ఓటు వేసే ఓటర్లను, ఓటర్లలో పూర్తి చైతన్యం ఉందని పూర్తిగా మేడ్చల్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు పడిన ఓట్లను బట్టి తేలిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికలలో మేడ్చల్ నుండి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు పోటీ పడ్డారు. 1,86,017 ఓట్లు పొంది మొదటి స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి ఉండగా, రెండవ స్థానంలో 1,52,598 ఓట్ల తో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ మూడవ స్థానంలో 50 535 ఓట్లతో బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మూడవ స్థానంలో నిలిచారు. 33419 ఓట్ల మెజారిటితో మల్లారెడ్డి ఎమ్మెల్యే గా గెలుపొందారు. 5 నెలల క్రితం జరిగిన ఎన్నికలలో జోరు చూపించిన బీఆర్ఎస్ 5నెలల తర్వాత జరిగిన ఎన్నికలలో ఏకంగా మొదటి స్థానం నుండి మూడవ స్థానంకు పడిపోయింది. మూడవ స్థానంలో ఉన్న బీజేపీ మొదటి స్థానంకు ఎగబాకగా రెండవ స్థానం మాత్రం కాంగ్రెస్ నిలబెట్టుకుంది.

ఎంతో తేడా..

గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు



1,86,171 ఓట్లు ,1,52,598 ఓట్లు కాంగ్రెస్ కు, బీజేపీ కి 50535 ఓట్లు వచ్చాయి. తాజా పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ కి 1,88,730, ఓట్లు, కాంగ్రెస్‌కు 119125 ఓట్లు ,67246 ఓట్లు బీఆర్ఎస్ అభ్యర్థికి లభించాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే బీజేపీకి 1,38,495 ఓట్లు అధికంచాయి. బీఆర్ఎస్‌కు 1,18,925 ఓట్లు తక్కువగా పడ్డాయి. దీంతో బీఆర్ఎస్ బలం ఓట్ల రూపంగా పూర్తిగా తగ్గిపోయింది. కాంగ్రెస్ కు 33,473 ఓట్లు అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువగా వచ్చాయి. ఓటర్లు విభిన్నంగా ఆలోచన చేసి ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌కు కోత పెట్టి బీజేపీ వైపు మొగ్గు చూపారు. కాంగ్రెస్‌కు సైతం జై కొట్టకుండా కేవలం బీజేపీకి మూడింతల ఓట్లు వేశారు.ఓటర్లు జాతీయ స్థాయిలో ఆలోచనలు చేయడం, రాష్ట్రంలో మారిన రాజకీయంతో బీఆర్ఎస్ మేడ్చల్ లో పూర్తిగా దెబ్బ తింది. బీజేపీ నాయకుల బలం కేవలం 50 వేల ఓట్లని గత అసెంబ్లీ ఎన్నికలలో తేలిపోయింది. ఈ ఎన్నికలలో 1,88,730,ఓట్లు రావడంలో ప్రధాని మోదీ చరిష్మా, బీజేపీ బలం, అభ్యర్థి ఈటల రాజేందర్ వ్యూహాలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి.

బీఆర్ఎస్‌కు బలం ఉన్నా..

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే మల్లారెడ్డి, అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో బలమైన క్యాడర్, నాయకులు ఉన్నా వారికి మొదటి నుండి ఎన్నికల వరకు నడిపించే వారు లేకపోవడం మైనస్‌గా మారింది. అభ్యర్థి పెద్దగా ప్రచారం చేయకపోవడం, ఎమ్మెల్యే మల్లారెడ్డి అంటీముట్టనట్లుగా వ్యవహరించడం, పార్టీ ప్రతికూల వాతావరణం తో ఓటర్లు కారును ఆదరించలేకపోయారు.

కాంగ్రెస్‌లో అంతే..

కాంగ్రెస్ లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత వలసలతో నాయకుల బలం పెరిగినా వారిని మండలాలు, మున్సిపాలిటీల వారిగా సమన్వయం చేసి నడిపించలేకపోయె నాయకుడు లేకపోవడంతో ఆ పార్టీకి అసెంబ్లీ కంటే పార్లమెంట్‌కు 33,473 ఓట్లు తక్కువగా వచ్చాయి. నాయకులు ఎక్కువ కావడంతో ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించడంతో ఆ పార్టీ అధికృత సాధించలేకపోయింది.

◆ ఏ ఎన్నికలకు ఆ ఎన్నికల తగ్గట్టుగా ఎప్పటికప్పుడు తమ తీర్పునిచ్చే మేడ్చల్ ఓటర్ ఎప్పటికి గ్రేటే. ఓటరు చైతన్యంగా ఉన్నంత కాలం మూడు రోజుల్లో నాయకుల బల్లు ఓడలు కావడం, ఓడలు బల్లు కావడం సహజమే.

అన్నపూర్ణ కాలనీలో జలమండలి ఏఈ పర్యటన


అన్నపూర్ణ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏఈ వేణుగోపాల్

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో బుధవారం మల్లాపూర్ జలమండలి ఏఈ వేణుగోపాల్ పర్యటించారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ కోసం సర్వే చేసి, ప్రతిపాదనల కోసం అంచనా కొలతలను తీసుకున్నారు. వారం రోజుల క్రితం నూతనంగా డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మందముల పరమేశ్వర్‌రెడ్డిని కాలనీ సలహాదారుడు శ్రీకాంత్‌రెడ్డి వినతి పత్రం అందజేసిన విషయం విధితమే. కార్యక్రమంలో అన్నపూర్ణ కాలనీ అధ్యక్షుడు భానుచందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, అస్లామ్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నారాయణ

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ అన్నారు. విద్యార్థులకు పర్యావరణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డీన్ దేవదాస్, రవికుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ నాగరాజు నాయక్, కల్చరల్ హెడ్ రోహిణిరెడ్డి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సుప్రభాతం నాటిక



మల్లాపూర్: రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ 65 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆధ్వర్యంలో రక్త కన్నీరు నాగభూషణం బిరుదు గ్రహీత, దర్శకుడు మాడుగుల కృష్ణమోహన్ రచించిన సుప్రభాతం నాటికను బుధవారం ఓల్డ్ మల్లాపూర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 1200వ నాటికను ప్రదర్శించారు. ఈ నాటిక పలువురిని ఆలోచింపజేసింది. నటుడు కృష్ణమోహన్, నటిమణి మనుప్రియ, సహాయ నటులు రమేష్‌గౌడ్, జంగయ్యగౌడ్, సత్యనారాయణ, ఫణిందర్, సాయిపవన్ తదితరులు పాల్గొన్నారు.

వాయిదాపడిన అవిశ్వాస తీర్మానం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. జిల్లా కలెక్టర్ గతంలో నిర్ణయించిన ప్రకారం బుధవారం జరగాల్సిన ప్రత్యేక సమావేశం నిలిచిపోయింది. తమను మభ్యపెట్టి సంతకాలను సేకరించారని కొందరూ కార్పొరేటర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కలెక్టర్ అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని వాయిదా వేశారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రతిపాదించి మేయర్ పదవి నుంచి దింపేయాలని కొన్ని నెలలుగా పలువురు కార్పొరేటర్లు ప్రయత్నించారు. ఇంతలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలో ఒక్కసారిగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. గత నెల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. దీనిపై విచారణ చేసిన కలెక్టర్ ఈ నెల 5న అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన విషయం విధితమే.

మహిళా హక్కుల కోసం పోరాటం


జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్.జ్యోతి

మల్లాపూర్: మహిళా హక్కుల కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నిరంతరం పోరాటాలు చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి అన్నారు. నాచారంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాల్లో మహిళలకు అవకాశాలు తగ్గాయన్నారు. మహిళా సాధికారత కోసం పాలకులు అవకాశలు కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి లక్ష్మీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఫైమిదా, రజని, మమత, రామ్ నారాయణ, కృపాకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాచారం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు రజిని, కార్యదర్శి యాకమ్మ, ఉపాధ్యక్షులు విజయ, శోభ, మృణాళిని, సహాయ కార్యదర్శి మరియమ్మ, రేణుక, రవళి, ప్రభావతి కోశాధికారి లక్ష్మీ తదితరులను ఎన్నుకున్నారు.

ప్రసాద్ ఆస్పత్రిలో వృద్ధుడి గుండె కవాటానికి చికిత్స



మల్లాపూర్: గుండె జబ్బుతో బాధపడుతున్న 79 ఏళ్ల వృద్ధుడికి నాచారం ప్రసాద్ ఆస్పత్రిలో ట్రాన్స్ ఆయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్(టీఏవీఐ) ప్రక్రియ ద్వారా విజయవంతంగా చికిత్స చేశారు. ఆస్పత్రిలోని కార్డియాలజిస్టు వైద్యులు సంపత్, సాయికృష్ణతో కూడిన బృందం చికిత్స చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుమా ప్రసాద్ మాట్లాడుతూ ట్రాన్స్ ఆయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ అనేది శస్త్ర చికిత్సకు ప్రత్యామ్నాయం అన్నారు. రోగి మెలకువగా ఉన్నప్పుడు చేయడం, పెద్ద కోతలు లేకుండా చేయడం దీని ప్రత్యేకత అని తెలిపారు. రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని పేర్కొన్నారు.

విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలి


ఉప్పల్ పారిశ్రామికవాడలో ప్రతిజ్ఞ చేస్తున్న పీసీబీ అధికారులు, పారిశ్రామిక వేత్తలు


మచ్చబొల్లారంలో సైకిల్ యాత్రలో చిన్నారులు

ఉప్పల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉప్పల్, మల్లాపూర్, నాచారం పారిశ్రామికవాడలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం సంయుక్తాధ్వర్యంలో హరిత ర్యాలీ నిర్వహించారు. అధికారులు, పారిశ్రామిక వేత్తలు చేతిలో ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అనే విధంగా ముందుకు సాగారు. అనంతరం పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ భావి తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. భూమిలో సారాన్ని పరిరక్షించడానికి విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ప్రతి వ్యక్తి పర్యావరణ కోసం నీటిని పొదుపుగా వాడాలని, నేల సారవంతాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ శరత్, శాస్త్రవేత్త మహేష్, ఇతర సిబ్బంది, శ్రీకృష్ణ ఫార్మా, జెర్సీ డైరీ, హెరిటేజ్ ప్రొడక్ట్స్, అరాజన్ ఇండస్ట్రీస్, షాహీ ఎక్స్‌పోర్ట్స్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.


మొక్కలు నాటే కార్యక్రమంలో నారాయణరెడ్డి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బోడుప్పల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థలో బుధవారం 27వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విడివిడిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రకృతిని కాపాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నడిచి వెళ్లండి.. ఆరోగ్యంగా ఉండండి..

అల్వాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోగ విష్ణుమూర్తి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మచ్చబొల్లారం డౌటన్ బజార్‌లో సైకిల్ యాత్ర నిర్వహించారు. నడిచి వెళ్లండి.. ఆరోగ్యంగా ఉండండి అని, వాయు కాలుష్యం తగ్గించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగేశ్వర్, మల్లికార్జున్, కన్న, కేశవ్‌రావు, జగన్, వెంకటేష్, విజయలక్ష్మి, సుదీప్, రాందాస్, స్థానిక చిన్నారులు పాల్గొన్నారు.

'యూనియన్ జాక్ నుంచి తప్పుకున్నాం'

మల్లాపూర్: ఈఎస్ఐ ఆస్పత్రి సొసైటీ చేయాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా గతంలో ఈఎస్ఐలో అన్ని యూనియన్లు కలిసి జేఏసీ జాక్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జాక్ నుంచి పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) తప్పుకుందని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పోలోజు నాగేష్‌చారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లెటర్ హెడ్ నుంచి ఇప్పటికైనా తమ యూనియన్ పేరును తొలగించాలని కోరారు. భవిష్యత్‌లో జాక్ తీసుకునే నిర్ణయాలకు తమకు ఎటువంటి సంబంధం లేదని వారు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో సందడి చేస్తున్న చిన్నారులు



బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్థానిక ప్రజలకు ఆహ్లాదం , ఆనందాన్ని పంచుతుంది. ప్రతిరోజూ సాయంత్రం చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా సందడి నెలకొంది. నగర శివారు ప్రాంతంలో నిత్యం బిజీగా ఉండే ప్రజలకు ఎంతో ఆనందాన్ని పంచుతోంది. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిరాహకులు నారాయణ తెలిపారు. తాజ్‌మహల్, ఎర్రకోట ప్రత్యేక ఆకర్షణగా ఉంది. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంటో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడకు వచ్చిన శివారు ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. జువెలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్ స్టాల్స్ మహిళలు, యువతుల మనస్సు దోచుకుంటున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రాంత ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి సేద తీరుతున్నారు.

సుపరిపాలన బీజేపీతోనే సాధ్యం


ప్రభాకర్‌ను అభినందిస్తున్న బీజేపీ కార్యకర్తలు, నేతలు

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

రామంతాపూర్: రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యుల గెలుపులో భాగమై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి వారి గెలుపునకు కృషి చేసేందుకు, అదేవిధంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు బుధవారం ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నేతలు రామంతాపూర్ బీజేపీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతూరు శ్రీనివాస్‌చారి, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకలు వేములకొండ సోమశేఖర్‌గౌడ్, రఘుపతిగౌడ్, వెంకన్నగౌడ్, రవీందర్‌రెడ్డి, వాసం పాండు, అంజయ్య పటేల్, ఏ.వి.చారి, వెంకటయ్య, వెంపటి శ్రీనివాస్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు


బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న ఉప్పల్ చిలుకానగర్ బీజేపీ నేతలు


ఈటలను సత్కరిస్తున్న మల్లెల నర్సింగ్‌రావు, అంజి తదితరులు

ఉప్పల్: మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ భారీ విజయం సాధించడంతో పాటు దేశంలో బీజేపీ కూటమికి భారీ మెజార్టీ రావడంతో ఉప్పల్ బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. వీధుల్లోకి వచ్చి బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలో బీజేపీ హవా కొనసాగుతోందని, మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అవుతున్నాడన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీ పవనాలు వీస్తున్నాయని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ చిలుకానగర్ నేతలు కంచర్ల భరత్‌రెడ్డి, గొనే శ్రీకాంత్, రాజేష్, రామరాజు యాదవ్, కొండల్‌రావు, గొనే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి..

మల్లాపూర్: మల్కాజిగిరి లోక్‌సభ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసిన ఈటల రాజేందర్ గెలుపుపొందిన సందర్భంగా బుధవారం నాచారం, మల్లాపూర్ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పలు చౌరస్తాల్లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. అనంతరం ఈటల రాజేందర్ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్, రవి నాయక్, పద్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, చంద్రమౌళి, రాగిరి మోహన్‌రెడ్డి, నవీన్‌కుమార్, రాజిరెడ్డి, నవీన్‌గౌడ్, దయగౌడ్, గోపి, అభిషేక్, చిల్లా అశోక్, అనితారెడ్డి, మంజుల వాణి తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షల వెల్లువ..

ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రావు, రాష్ట్ర పొల్ట్రీ సెల్ కన్వీనర్ అంజి కొరపాక, యోగేష్ కుమార్ ఉన్నారు.

ఎంపీ బండి సంజయ్‌కి శుభాకాంక్షలు

గౌతంనగర్: కరీంనగర్ పార్లమెంట్ నుంచి గెలుపొందిన బండి సంజయ్‌ని బుధవారం గౌతంనగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.స్వర్ణలత, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సత్కరించి.. అభినందనలు తెలిపి..

రామంతాపూర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిచిన ఈటల రాజేందర్‌ను బుధవారం రామంతాపూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత గడ్డం సాయికిరణ్ కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బీజేపీ నేతలు రాగి వెంకట్‌రెడ్డి, గడ్డం వెంకట్ సాయి, హనుమంత్‌రావు, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, రాంబాబు, రఘురెడ్డి తదితరులు ఉన్నారు.


నాచారంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు


ఈటలను సత్కరిస్తున్న పోతగాని గోపాల్‌గౌడ్ తదితరులు


ఎంపీ బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శిల్పారెడ్డి, స్వర్ణలత

పెట్రోల్ దొంగలకు రిమాండ్

అడ్డగుట్ట: అర్ధరాత్రుల సమయాల్లో బైక్‌లలో నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్న ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించిన ఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్(20), విక్రమ్(20) స్నేహితులు. ఈ నెల 2న అర్ధరాత్రి లాలాపేటలోని ఇందిరనగర్ కాలనీలోని ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ దొంగిలిస్తున్నారు. అదే ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని బుధవారం కోర్టులో హాజరు పరచగా రెండ్రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సికింద్రాబాద్ అభివృద్ధికి పాటుపడాలి

లాలాపేట: సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కిషన్‌రెడ్డి ఘన విజయం సాధించడంపై తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా. పి. మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తార్నాకలోని కాలనీలు, అపార్టుమెంట్ వాసుల సమస్యలపై దృష్టి సారించడంతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి పాటు పడాలని కోరారు.